క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



దుగ్గిరాల: మండలంలోని గొడవర్రులో బుధవారం ఆది రేణుకమ్మ తల్లి, పోతురాజు స్వామి నూతన విగ్రహాల ప్రతిష్ట కన్నుల పండువగా జరిగింది. ఉదయం 8.22 గంటలకు నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి స్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఎన్.గోపాలకృష్ణ, కె.రామారావు, పి.ప్రసాద్, ధనరాజు, శ్రీనివాసరావు, పోతురాజు, శ్రీహరి, హర్షవర్ధన్, మల్లికార్జున, ఆదిశేషు పాల్గొన్నారు.

ఈ-వేస్ట్ సేకరణ



మంగళగిరి టౌన్: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది నిరుపయోగంగా ఉన్న బ్యాటరీలు, పాత కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇందు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని వారంతా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఎంటీఎంసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనానికి అందజేయాలని సూచించారు. ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట పార్క్‌రోడ్ ఎంట్రన్స్ వద్ద ఏర్పాటు చేయనున్న ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్ రీయూజ్ రీ సైకిల్) సెంటర్‌లో అందించవచ్చని తెలిపారు. ఈ-వ్యర్థాల సేకరణ, రీసైకిల్ చేయడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా వనరులను సంరక్షించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

భూముల రీ సర్వేకు సహకరించాలి




దుగ్గిరాల: భూముల రీ సర్వేకు రైతులు, గ్రామస్తులు సహకరించాలని డెప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ కోరారు. భూముల రీ సర్వేపై దుగ్గిరాల పంచాయతీ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. డెప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ మాట్లాడుతూ దుగ్గిరాలలో మూడు టీంలు సర్వే చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాన్ని ఆరు బ్లాకులుగా విభజించినట్లు తెలిపారు. ముందుగా గ్రామ సరిహద్దులు నిర్ణయిస్తామని చెప్పారు. అనంతరం ప్రభుత్వ భూములు, మిగతా భూములను కొలుస్తామని వివరించారు. రీ సర్వే ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని నతెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపాలరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ



దుగ్గిరాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందించిన వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ షేక్ జబీన ద్రైవాన్ స్ప్రేయర్లు, విత్తన గొర్రులు, సాగు యంత్రాలు, వ్యవసాయ పరికరాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎంఏఓ పి.శిరీష మాట్లాడుతూ మొదటి దశలో రూ. 22.44 లక్షల విలువైన పనిముట్లు అందజేశామని చెప్పారు. ఇంకా అవసరమైన రైతులు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చైతన్య, ఈమని సర్పంచ్ హరిణి, చింతలపూడి సర్పంచ్ టి. రామకృష్ణ, కె.శ్రీఅనిత, వి.కృష్ణప్రసాద్, జి.వెంకట్రావు, వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, రమేష్, దివ్యశ్రీ పాల్గొన్నారు.

ఫిరంగిపురం సీఐగా శివరామకృష్ణ



ఫిరంగిపురం: స్థానిక పోలీసు స్టేషన్ సీఐగా కె.శివరామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐడీ డిపార్టుమెంటులో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలపై దృష్టి సారించి అరికడతానని చెప్పారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన రవీంద్ర బాబు వీఆర్‌కు వెళ్లారు.

రైతు చూపు.. 'ఉద్యాన'ం వైపు !

- నియోజకవర్గంలో 2500 ఎకరాలలో సాగు
- నూతనంగా పామాయిల్ సాగు
- గిట్టుబాటు ధరలు కల్పించాలంటున్న రైతులు
- రాజధాని రాకతో 1500 ఎకరాలలో ఆగిన కూరగాయలు పంటలు



పామాయిల్ మొక్కలు ట్రాక్టర్లలో తీసుకు వస్తున్న రైతులు

మంగళగిరి: ఒకప్పుడు ఉద్యాన పంటలకు రైతులు ముందుకు వచ్చే వారు కాదు. ఆ శాఖ అధికారులు ప్రచారంతో మార్పు వచ్చింది. పంటలు సాగు, వ్యయం కూడా తక్కువ కావడంతో ఆసక్తి చూపుతున్నారు. పసుపు, అరటి, పూలు, కాయగూరలు, ఆకు కూరలు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. నూతనంగా పామాయిల్ కూడా సాగు చేస్తున్నారు. మొక్కలను ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

తక్కువ ఖర్చుతో లాభాల పంట

ఉద్యాన పంటలు సాగు ఖర్చు తక్కువ కావడంతో పాటు రైతులు ఆశించిన స్థాయిలో ధరలు దక్కడంతో ఎక్కువ మంది ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది అరటి, కూరగాయలు, ఆకుకూరలకు రైతులు ఆశించిన స్థాయిలో ధర లభించింది. నియోజకవర్గంలో ఎక్కువగా కృష్ణా తీరాన ఉన్న పొలాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. తాడేపల్లి మండలంలోని కుంచనపల్లి, గుండిమెడ, చిర్రావూరు, ప్రాతూరు , మంగళగిరి మండలంలోని నూతక్కి, రామచంద్రాపురం, పెదవడ్లపూడి, చినవడ్లపూడి, దుగ్గిరాల మండలంలో నదీ తీరాన వెంట ఉన్న గ్రామాల్లో సాగు అధికంగా చేపట్టారు.

అరటితో మూడేళ్ల వరకు ఆదాయం

అరటి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఒకసారి వేస్తే మూడు సంవత్సరాల వరకు పంట ఉంటుంది. పైగా ఖర్చులు కూడా తక్కువ. ఎకరా అరటి సాగుకు రూ. 20 వేలు మొక్కలకు, సేద్యానికి రూ. 15 వేలు, ఎరువులు, డ్రిప్ మందులకు రూ. 45 వేలు, కూలి ఖర్చు రూ. 10వేలు కలిపి సుమారు ఎకరాకు రూ. లక్ష వరకు పెట్టుబడి అవుతుంది. సక్రమంగా అన్ని అనుకూలించి పంట చేతికి వస్తే 12 టన్నుల నుంచి 18 టన్నుల వరకు ఎకరాకు దిగుబడి వస్తుంది.

రాజధానిప్రాంతంలో మాత్రం తగ్గిన సాగు

రాజధాని అమరావతి రాక ముందు రైతుల 3,500 నుంచి 4వేల ఎకరాలలో ఉద్యాన పంటలు సాగు చేసేవారు. రాజధాని అమరావతికి పెనుమాక , ఉండవల్లి గ్రామాలను తీసుకోవడంతో 1,500 ఎకరాలలో పూలు, కూరగాయలు, ఆకుకూరల పంటలు సాగు నిలిచిపోయింది. దీంతో ప్రస్తుతం 2,500 ఎకరాలలో మాత్రమే పంటలు సాగు చేస్తున్నారు. దిగుబడి వచ్చిన పంటలకు విక్రయించుకునేందుకు మార్కెట్ లేకపోవడంతో రైతులు కూడా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. విజయవాడ హోల్‌సేల్ మార్కెట్‌కు వెళ్లి విక్రయిస్తున్నారు. స్థానిక వ్యాపారులు, దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటుండగా రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం కారణంగా మరింత నష్టపోతున్నారు.

ఇటీవల ఉద్యాన పంటల సాగు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

> ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఆ శాఖ అధికారుల సూచనలు తీసుకోవాలి. తెగుళ్లు సోకినప్పుడు సొంతంగా మందులు వాడకుండా అధికారులను సంప్రదించాలి. కొంత మంది పురుగు మందులు దుకాణాల వారి సలహాలు తీసుకుని మందులు వాడి నష్టపోతున్నారు. అధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చు.
>
> –కె దీపిక, ఉద్యానశాఖ అధికారి

పర్యావరణ హిత ఎలక్ట్రానిక్స్ తయారీపై దృష్టి అవసరం

అన్నా యూనివర్సిటీ డీన్ ఆర్. జయవేల్



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఐసీఈఈఎస్-2025 పేరుతో 'ఎమర్జింగ్ ఎలక్ట్రానిక్ సస్టైనబిలిటీ' అంతర్జాతీయ సదస్సును బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమిళనాడులోని చెన్నైకు చెందిన అన్నా యూనివర్సిటీ డీన్ ఆర్. జయవేల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో మెటీరియల్స్ వినియోగం ద్వారా పర్యావరణ హితం కలిగించే ఎలక్ట్రానిక్స్ తయారీపై దృష్టి సారించాలని తెలిపారు.

రిజిస్ట్రార్ కె. సుబ్బారావు మాట్లాడుతూ సదస్సుకు అడ్వాన్స్ నేషనల్ రిసెర్చ్ ఫౌండేషన్ ఆర్థిక సహకారం అందించినట్లు పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి 400కు పైగా పరిశోధన పత్రాలు వచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా చెన్నైకు చెందిన ఎంఎంటీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వి.రాజేంద్రన్ పర్యావరణ మార్పులకు అనుగుణంగా తట్టుకునే ఎలక్ట్రానిక్ వ్యవస్థల అవసరాన్ని వివరించారు. సదస్సులో వడోరాకు చెందిన జీఎస్‌ఎఫ్‌సీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జి.ఆర్. సిన్హా, ఐఆర్‌డీ విభాగాధిపతి వి. విశ్వనాథ్ షెనోయ్, కేఎల్‌యూ వీసీ జి. పార్థసారథివర్మ, ప్రో వీసీలు ఏవీఎస్ ప్రసాద్, కె. రాజశేఖరరావు, ఎన్. వెంకట్రామ్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి కేఆర్ఎస్ ప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి ఎం. సుమన్, ఐఆర్‌డీ అసోసియేట్ ప్రొఫెసర్ వి. వివేకానందన్, ఈఎల్‌జీఈ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్. అరుణ్ మేధా, ఎన్ఐటీ, ఐఐటీలతో పాటు జాతీయ విద్యాసంస్థలు, ఇతర దేశాల నుంచి పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

29 మందికి జరిమానా

విజయవాడలీగల్: మద్యం సేవించి వాహనాలు నడిపిన 29 మందికి 8వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు జరిమానా విధించారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో 5వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్య సేవించి వాహనాలు నడిపిన వారిలో 11మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, 18 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రతిరోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి.. పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేయడం జరుగుతుందని, వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు సూచించారు.

గుంటూరు చానల్‌లో గుర్తు తెలియని మృతదేహం



మంగళగిరి టౌన్ : మంగళగిరి నగర పరిధిలోని గుంటూరు చానల్‌లో బుధవారం గుర్తు తెలియని మృత దేహాన్ని పోలీసులు వెలికి తీశారు. మంగళగిరి నగర పరిధిలోని తెనాలి రోడ్డులో గుంటూరు చానల్ బ్రిడ్జి కింద మృతదేహం ఇరుక్కుపోయి ఉండటాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గుర్రపుడెక్కలో ఇరుక్కున్న మృతదేహాన్ని వెలుపలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఆధారాలు లభించలేదని, వయస్సు 30 సంవత్సరాలు ఉండొచ్చని ఎస్ఐ తెలిపారు. శరీరంపై నలుపు, ఆకుపచ్చ చారలతో టీ షర్ట్, నలుపురంగు ఫ్యాంట్ ధరించిన ఉన్నాడని చెప్పారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే మంగళగిరి పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

న్యాయస్థానాల తీర్పులను అమలు చేయాలి



శిబిరంలో కార్మికులకు సంఘీభావం తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని బుధవారం నాయకులు కూరపాటి స్టీవెన్, టి. నాగేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినపుడు కార్మికులు తమ సమస్యను విన్నవించుకున్నారన్నారని తెలిపారు. స్పందించిన ఆయన తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను ఆయన నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు ఎం. గురవయ్య, సాంబశివరావు, హగ్గయ్య, ఇమాంబి, శివకుమారి, దుర్గా భవాని, సారమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



యర్రబాలెం(మంగళగిరి): మండలంలోని యర్ర బాలెంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగిలి రాంబాబు(32) యర్రబాలెంలో నివాసముంటూ, ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిదండ్రులతో పాటు భార్య వదిలేయడంతో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. మంగళవారం పనికి వెళ్లిన రాంబాబుకి కంపెనీ యజమాని నిత్యావసర సరకులు కొనిపెట్టగా ఇంటికి వచ్చాడు. ఆ రాత్రి ఇంటిలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పనికి రాలేదని తెలుసుకున్న యజమాని బుధవారం ఉదయం ఇంటికి వెళ్లి చూడగా రాంబాబు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండటంతో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాంబాబు మృతదేహాన్ని ఎయిమ్స్ ఆసుపత్రిలోకి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రారండోయ్.. వేడుక చేద్దాం !

- మోగనున్న పెళ్లి బాజాలు
- ఈ నెల రికార్డు స్థాయిలో సుముహూర్తాలు



వివాహంలో ముఖ్య ఘట్టం

మంగళగిరి టౌన్: ప్రతి ఒక్కరి జీవితంలో పెళ్లి ముఖ్యమైన ఘట్టం. వివాహ బంధంతో ఒకటైన ఇద్దరు వ్యక్తులు చివరి వరకు జంటగా జీవనం సాగిస్తారు. పెళ్లితో రెండు కుటుంబాల మధ్య బంధం ఏర్పడుతుంది. అది బలపడి జీవిత పయనంలో కలసి ఆనందంగా గడుపుతుంటారు. పెళ్లంటేనే ఇద్దరు వ్యక్తులు, రెండు కుటుంబాలకు సంబంధించి ముఖ్యమైన అంశం. హిందూ మతంలో వివాహానికి చాలా ప్రాధాన్యతమిస్తారు.

వరుసగా ముహూర్తాలు

మండు వేసవిలో శుభ ఘడియలు వచ్చాయి. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ముహూర్తాలు ఎక్కువగా ఉన్నాయి. ఏప్రిల్ నెలలో 13వ తేదీ నాటికి మూఢం వెళ్లిపోయింది. సూర్యుడు కుంభం నుంచి మీన రాశిలోకి ప్రవేశించాడు. వరుసగా మంచి రోజులు రావడంతో పెళ్లి మండపాలు, బ్యాండ్ మేళాలకు డిమాండ్ ఏర్పడింది. పురోహితులు, వంట మనుషులు, ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఆర్డర్లు తలుపుతడుతున్నాయి. సాధారణంగా నెలలో ఒకటి, రెండు, మూడు, నాలుగైదు ముహూర్తాలు ఉంటాయి. కానీ ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలలో 29 ముహూర్తాలు ఉండడం చాలా అరుదు. గతంలో ఎప్పుడూ ఇన్ని రాలేదని పురోహితులు చెబుతున్నారు. ఒక్క ఏప్రిల్‌లో ఏకంగా తొమ్మిది ముహూర్తాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు.


ఆషాఢ మాసం మొదలు ఇలా..

జూన్ 11 నుంచి జూలై 12 వరకు ఆషాఢ మాసంలో ముహూర్తాలు లేవు. మళ్లీ జూలై 25 నుంచి శ్రావణ మాసంలో మంచి రోజులు ఉన్నాయి. కాగా ఏప్రిల్ 30వ తేదీన అక్షయ తృతీయ సందర్భంగా వేలాది పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉందని పురోహితులు అంటున్నారు.

ముహూర్తాల తేదీలు

ఏప్రిల్ –16,18,19,20,21,25,29,30
మే–1,3,4,8,9,10,11,14,16,18,19,21, 23, 25,30
జూన్ –2,4,5,6,7,8

మూడు నెలలు శుభ ఘడియలు



> మూడు నెలల పాటు ముహూర్తాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సమయంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు జరుపుకోవడం చాలా మంచిది. ముఖ్యంగా ఈనెల 30వ తేదీ అక్షయ తృతీయ దివ్యమైన ముహూర్తం ఉంది. పెళ్లి ముహూర్తాల కోసం ఎదురు చూస్తున్న వారికి ఇది మంచి తరుణం.
>
> –నంబూరి వంశీ కృష్ణమాచార్యులు, అర్చకులు

ఆశా కార్యకర్త రాధకు అవార్డు



రాధను అభినందిస్తున్న వైద్యులు ఫరీనాబేగం, యానీగ్రేస్, సిబ్బంది

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడుకు చెందిన పొనుగుపాటి రాధకు ఉత్తమ ఆశా కార్యకర్త అవార్డు వచ్చినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు ఫరీనా బేగం బుధవారం తెలిపారు. వైద్యశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లా స్థాయిలో ఉత్తమ కిల్కారీ సేవలు మెరుగ్గా అందించినందుకు అవార్డు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్త రాధను వైద్యులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ యానీ గ్రేస్, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, కె.సుదర్శన్ రాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

మంగళగిరి: అగ్నిప్రమాద వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని టిడ్కో నివాసాల వద్ద బుధవారం సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ పేలినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాల నివారణ, ప్రాణ, ఆస్తి సంరక్షణ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో మంగళగిరి అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశంలో పెరుగుతున్న అంటరానితనం, అసమానతలు



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

తాడేపల్లి రూరల్: దేశంలో అంటరానితనం, అసమానతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని విప్లవ రచయిత సంఘం (విరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కన్వీనర్ కిరణ్ తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని యానాదుల కాలనీలో బుధవారం పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా యానాదులు ఉద్యమాలు నడిపారని తెలిపారు. వారి తాకిడిని తట్టుకోలేని బ్రిటిష్ ప్రభుత్వం పోరాట యోధులైన ఊటుకూరు కోటయ్య, నిమ్మల శేషయ్య, ఎర్ర సుబ్బయ్య, కత్తి చెల్లెమ్మ, వేణుబాక రామయ్య తదితరులపై దాడి చేసి జైళ్లలో బంధించిందని చెప్పారు. పురాతత్వ పరిశోధనల ప్రకారం తెలుగు భాష ప్రాచీనత 2400 సంవత్సరాల నాటిదని తెలిపారు. ఈ భాషని, యానాదులే మాట్లాడేవారని, తీసుకువచ్చింది వారేనని పరిశోధనలు చెబుతున్నాయని వివరించారు. పౌరహక్కుల సంఘం గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు షేక్ నాగూర్ వలి, శ్రీధర్‌లు మాట్లాడుతూ నేడు ముస్లింలు, క్రిస్టియన్లపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో సంఘటనలు దేశ ప్రజలంతా చూశారన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో పగడాల ప్రవీణ్‌ని ఎవరు హత్య చేశారో ఇప్పటి వరకు వెలుగులోకి రాలేదని తెలిపారు. పౌరహక్కుల సంఘం గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి గోపీనాథ్ మాట్లాడుతూ ఇటీవల మంగళగిరిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఛత్రపతి శివాజీ పుట్టిన రోజు సందర్భంగా ఊరేగింపుగా ర్యాలీ చేశారని గుర్తు చేశారు. తమకు ఎవరైనా ఎదురు చేస్తే వారిపై భౌతిక దాడులు చేస్తామని ఉద్దేశపూర్వకంగా ర్యాలీ నడిచినట్టే ఉందని ఆయన పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు

తాడేపల్లి రూరల్: డిగ్రీ చదివిన విద్యార్థిని, విద్యార్థులతో పాటు నిరుద్యోగులకు మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణ, ఎన్‌టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాలోని వారికి ఈనెల 26వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కోర్సు కాలపరిమితి మూడు నెలలు అని, ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రతి శనివారం, ఆదివారాల్లో తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వారికి మంగళగిరి రత్నాల చెరువు అండర్ పాస్ వద్ద గల మానవ సేవా సంస్థ కార్యాలయంలోను, కృష్ణ, గుంటూరు, పశ్చిమ గోదావరి, ఎన్‌టీఆర్ జిల్లాల వారికి తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని కుంచనపల్లి వద్ద ఉన్న కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. మరిన్ని వివరాలకు 9393771663, 9985222857 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రజక సంఘం నాయకులు

తాడేపల్లి రూరల్: కొండపల్లిలో ఈనెల 20,21వ తేదీల్లో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని తాడేపల్లి నగర కమిటీ అధ్యక్షులు ఉండవల్లి పార్థసారథి పిలుపునిచ్చారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో బుధవారం రాష్ట్ర మహాసభల కరపత్రాల పంపిణీలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రజకులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. అపార్ట్‌మెంట్ల వద్ద చిన్న చిన్న సమస్యలపై దాడులు, దౌర్జన్యాలతో పాటు అక్రమ కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. రజక వాచ్‌మెన్, ఇస్త్రీదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20,21వ తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మహాసభల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య, రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వల్లభాపురం మస్తాన్‌రావు, మునిపల్లి సాంబశివరావు, తాడేపల్లి శ్రీనివాసరావు, ధనుంజయరావు, శివపార్వతి, చంచమ్మ, జ్యోతి, రవణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పీఎండీఎస్ కిట్లపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పీఎండీఎస్ (ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్)లో భాగంగా 30 రకాల పప్పు దినుసులు, నూనె, తీగ సంబంధిత విత్తనాలతో 65 కిట్లను తయారు చేశారు. దీనిపై రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. రుతుపవనాలు రాకముందే ప్రతి రైతూ సారవంతంగా ఉండేందుకుగాను ఎకరా పొలంలో పీఎండీఎస్ 12 కిలోల కిట్‌ను చల్లుకోవాలని సూచించారు. నలభై రోజులకు ఎదుగుదల ఉంటుందని తెలిపారు. తరువాత పొలంలోనే కలియదున్నుకోవాలని, దీని ద్వారా భూసారం పెరిగి అధిక దిగుబడి ఇచ్చేందుకు దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఎన్ఎఫ్ఏ ఉమాదేవి, ఎంటీ వరప్రసాద్, మోడల్ మేకర్ ఇర్ల వెంకటేశ్వర్లు, అన్నామణి, ఇంచార్జి రామకృష్ణ, అమల, రైతులు పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో సత్యసాయి హైస్కూలు విద్యార్థుల సత్తా



టీంతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తాడికొండ: జిల్లాస్థాయిలో నిర్వహించిన ఏపీ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ 2025–26 పోటీల్లో తమ కళాశాల బాలుర విభాగం జట్టు ప్రథమ స్థానం, బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించారని సత్యసాయి హైస్కూలు ప్రిన్సిపాల్ బి. కృపాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13–14 తేదీల్లో విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు వై.అభిషేక్, షేక్ సుభాని, ఎన్. అవినాష్‌లు జట్టును ప్రథమ స్థానంలో నిలిపారని పేర్కొన్నారు. బాలికల జట్టులో పి. ఆఫ్రిన్, పి. మహిమ, బి. లాస్యలు జిల్లా జట్టులో ప్రతిభ కనబరిచి తమ పాఠశాల పేరును ఇనుమడింపజేశారని ఆయన వివరించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను కరస్పాండెంట్ సాయి మోహనకృష్ణ, సీఈవో కుర్రా అమలతో పాటు ఉత్తమ శిక్షణ ఇచ్చిన పీడీ అనీల్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ రాయపూడి అనిల్ కుమార్ పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలిలో పునఃప్రారంభమైన సదరం క్యాంప్



శిబిరానికి హాజరైన దివ్యాంగులు

తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాల పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. గురు, శుక్రవారాలలో కూడా క్యాంప్ జరుగుతుందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్య వాణి తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com